# తోడేలు - గొల్లపిల్లవాడు

ఆరోజు శనివారం. నాన్నగారు కేసు నిమిత్తం రాజమండ్రి వెళ్లారు. ఇంకేం మాపనులకు పట్టపగ్గాలుండవుగా! ఏం చేసిన అక్కయ్య తప్పించి, అన్నయ్యా, అమ్మ ఏంవని అడగరు. నాన్నగారుంటే అసలు ఏ సినిమాకు వెళ్ళనివ్వరు. అందులోను ఇంగ్లీషు పిక్చర్లకు అసలే వెళ్ళనివ్వరు. అక్కయ్య కూడ అంతే...నాన్నగారు లేరుగా, అక్కయ్యకు నచ్చచెప్పి పిక్చరుకెళదామనుకున్నాం. క్రౌను టాకీసులో "కొవాడిస్" వచ్చింది. బలే స్టంటుపిక్చరు. స్టంటు పిక్చరంటే మహా ప్రాణం. అందులో హీరో బలేగా యుద్ధం చేశాడుట, నిన్న వెళ్ళిన రామం చెప్పాడు. ప్రతీ విద్యార్థి చూడవలసిందన్నాడు. డబ్బులైతే ఆమాత్రం మాదగ్గర లేకపోలేదు. (అసలు మాదగ్గర ఎడ్వాన్సుగా ఒక పిక్చరుఖర్చుకు తగ్గట్టుగా ఉంటుందిలెండి! మాలోకి) పెద్దవాడు గోపాలం. గోపాలంతో ఈసంగతి చెప్పాను. సత్యాన్ని కూడ పిలచి మా గదిలో కూర్చుని, ఆలోచించాం. అక్కకు ఎలాగు నచ్చచెప్పి "కొవాడిస్"కు వెళ్లటమా అని. అసలు అక్కయ్యతో కాస్సేపు తియ్యగా మాట్లాడి "అక్కయ్యా! మేం సినిమాకు వెళతాం"అని అంటే చాలు డబ్బులిచ్చి పంపుతుంది.

అక్కయ్యతో సరదాగామాట్లాడటం ఒక్క గోపాలానికే తెలుసు. అంచేత అక్కయ్యతో కాస్సేపు కబుర్లుచెప్పి వెడదాం అనుకున్నాం. కాని అక్కయ్య తోకలా సూర్యం తిరుగుతుంది. ఎలాగు? మేంపిక్చరుకు వెళ్లుతున్నట్లు తెలిసిందో, వెంట వస్తానని మారాంచేసి ఏడుస్తుంది. పోనీ తీసుకవెళ్ళామా, నాన్నగారు రాఁగానే "నాన్నగారూ! మేమంతా మీరు లేనప్పుడు కొవాడీసుకెళ్లామండి. చాలబావుంది. అని ఏవేవో చెబుతుంది. తీసుకువెళ్లకపోతేనాన్నగారు రాజమండ్రీనుంచి గుమ్మం

పక్కింటి బాలకృష్ణారావు

లోనికి అడుగు పెట్టగానే ఫిర్యాదు. సూర్యం ఫిర్యాదు చేసిందంటే మా పని తాం. సత్యానికి బలే ఉపాయం తట్టింది. ప్రయివేటు క్లాసుందని చెప్పి పిక్చరుకు వెడదామన్నాడు. భేష్! అనుకున్నాం. మేం ఏపిక్చరుకు వెళ్ళినా మా పక్కింటి హరి వస్తుంటాడు మాతో. హరిని పిలచాం. ఎగిరి వచ్చాడు. మాప్లానంతా చెప్పేం. బావుందన్నాడు. హరిని ఒంటిగంట్కకే రమ్మని చెప్పాం. వాళ్ళింటి దగ్గర ప్రయివేటు కెళుతున్నానని వచ్చేశాడు. ప్రయివేటుకు రమ్మని మమ్మల్ని పిలిచాడు. అక్కయ్య అడిగింది ఏంప్రయివేటని. "ఇంగ్లీషు మాష్టరుగారు ప్రయివేటుక్లాసు పెట్టారు, రెండుగంటలకే రమ్మన్నారు." అనిచెప్పాడు హరి. అక్కయ్య ఏమంటుందో అని గుండెబితుక్కుబితుక్కుమని కొట్టుకుంది. అక్కయ్య మారుమాట్లాడ లేదు. అక్కయ్య దగ్గరగానేఉంది."మేంఅప్పుడే రాము ఇంకా ఒంటిగంటన్నరే కాలేదు. ముందెందుకు వెళ్లడం దండగ. టైము వేస్టు. అప్పుడే రాము. యిష్టం ఉంటే 1½ వరకు ఉండు వస్తాం" అన్నాను నిక్కచ్చిగా.

"అయితే నేముందుగా వెళతా" నని పోయాడు హరి. (ఇదంతా మా నాటకంలెండి). హరి ఎక్కడికెళతాడో మాకు తెలియకపోదు. సినిమాకు వెళ్లేదారిలో మా వేణు ఇల్లుంది. ఎన్నిపిక్చర్లకు ఎన్నిసార్లు వెళ్ళినా, వాళ్లనాన్న ఏమీఅనరుట. ఎంతో మంచివారు. వాళ్లింటో పుట్టవలసిందని ఎన్నోసార్లు అనుకున్నాం. దేముడికిబుద్ధిలేదు. అసలు ఒకసారి పిక్చరుకు వెళ్లకపోతే, ఎందుకు వెళ్లలేదు, వెళ్లు అని పురమాయించి పంపుతారుట. అంత మంచివారు. (ఆయనకి సినిమాలంటే పిచ్చిలెండి) సరిగ్గా ఠంగ్ మని ఒంటిగంటన్నరయింది. బయలుదేరాం మేం ముగ్గురం. తిన్నగా పుస్తకాలు పట్టుకొని చుట్టు తిరిగి, అంటే స్కూలుకువెళ్లే దారిగుండా వేణు దగ్గర కెళ్ళి పుస్తకాలు వాళ్లింట్లో పెట్టి "కొవాడిస్"కు పోయాం. హాల్లో కూర్చున్నంతసేపు హీరో వెనకాలే నేనున్నట్లు వాడికి దెబ్బతగిలితే, నాకే తగిలినట్లు వాడు ఓడిపోతూంటే, నాకే

పరాజయం కలిగినట్లయింది. సరి! పిక్చరు వదిలేశారు. తిన్నగా పుస్తకాలు తీసుకొని చుట్టు తిరిగి ఇంటికి పోయాం. ఇంతఆలస్యం అయిందేం అని గుమ్మం ఎక్కుతూంటేనే అక్కయ్య ప్రశ్న వేసింది. అబ్బే! ఏంలేదక్కయ్యా! దారిలో రామారావుయింట్లో కాసేపు కూర్చుని వచ్చాం అని బుకాయించాను. మేం కోవాడీసుకు వెళ్ళినట్లు ఎవ్వరికి తెలియనీయలేదు. ఆదివారం సాయంకాలం నాన్నగారు వచ్చారు. కోర్టులో ఎవరో ప్లీడర్లు చెప్పారుట. కోవాడీసు చాల బావుందని. సోమవారం రాత్రి ఫస్టుషోకు సూర్యంని తీసుకవెళ్లారు. ఆమర్నాడు సూర్యం చాల గొప్పగా కోవాడీసుగురించి చెప్పింది.

మరిమనమూ చూశాంగా, నేనూ చెప్పాను, హీరో యిలా ఏక్టు చేశాడంటూ. ఎప్పుడు చూశావని అడిగింది. మొన్న శనివారం ప్రయివేటుక్లాసుకు వెళ్తామని బుకాయించి సినిమాకి వెళ్లేంఅనిగొప్పగా చెప్పేను. అప్పుడే అక్కయ్య కంప్లెయింటు, అబద్ధాలాడి ఎందుకెళ్లారని. అంతా బిక్కముఖం వేసుకూర్చున్నారు. సరి ఆ గొడవయిపోయింది. పరీక్షలు దగ్గరకొచ్చాయి. క్లాసులో కోర్సు పూర్తికాలేదు. మా యింగ్లీషు మాస్టరుగారు ప్రయివేటుక్లాసులు పెట్టి కంప్లీటు చేస్తానన్నారు. రేపు శనివారం మధ్యాహ్నం ప్రయివేటుకురండి అని చెప్పారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు నిజంగా పుస్తకాలు పట్టుకొని పక్కింటి హరి వచ్చాడు. రండి టయిమయిందన్నాడు. అక్కయ్య వేసింది అప్పుడే ప్రశ్న. ఎక్కడికని? "చేతులో పుస్తకాలు కనబట్టంలేదూ ప్రయివేటుక్లాసుకు" అన్నాను. "మీ డాబులు, వేషాలు కట్టిపెట్టండి. మా బావుంది ప్రయివేటుక్లాసని పిక్చర్లకెళ్లటం? ఎంతమాత్రం వెళ్లటానికి వీలులే"దంది. "చూడక్కా! మా జేబుల్లో డబ్బులేందే, ఎలాగు వెళతాం?" అన్నాను. "మీ వాడప్పుడే రడీగా మీగురించి ఉంటాడని తెలియదనుకోకు. ఎంతమాత్రం వెళ్లవ"ద్దంది. అమ్మతో రిపోర్టు చేశాం.

అమ్మకూడ అక్కమాటే. "కొత్త పిక్చరు "పరివర్తన" కామీ తయ్యారు? నాన్నగారితో చెబుతా"నంది. ఇంకేం చేస్తాం! "లేదమ్మా మా మాస్టరుగారు ప్రయివేటు క్లాసు పెట్టారు. పిక్చరుకు కాదు." అన్నాను. అమ్మ, అక్కయ్య ఎలాగు నమ్ముతారు? "తోడేలు - గొల్లపిల్లవాడు" కథలోనీతి మాకు బాగా తెలిసొచ్చింది. ఆరోజు ప్రయివేటుకు ఆబ్సెంటు. ఇప్పటికీ ప్రయివేటంటే అక్కయ్యకు, అమ్మకు పిక్చరనే భావం. ★




గొల్లభామ పాలు

నిండు మీగడ పాలు

తీపి పాలు

గడ్డ పాలు

ఇప్పుడు 4 ఔన్సుల టిన్నులలోకూడా లభించును.

నెజ్సిల్సు, పి. ఓ. బాక్సు. 180, మదరాసు-1.

NMM/G/2B